

గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తాం..

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్ : నెల్లూరు నగరంలోని గోమతి క్యాంప్ కార్యాలయంలో 5,8,15,40 డివిజన్ల పార్టీ నాయకులతో మాజీ మంత్రివర్యులు పొంగూరు నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడుకి ప్రపంచ మంతా తోడుగా ఉందని... త్వరలోనే బయటకు వస్తారన్నారు. రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనకి రోజులు దగ్గర పడ్డాయన్నారు. తెలుగుదేశం పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాల న్నారు. 2024 లో గెలుపే లక్ష్యంగా ముందడుగు వేయాల న్నారు.. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసి చంద్రన్నను గెలిపించుకోవాలని సూచించారు. ప్రధానంగా దొంగ ఓట్లపై ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి నారాయణ

వైసిపిలో అగ్నికి ఆజ్యం..!

వైసిపి నేతల్లో సమన్వయం చేసి పార్టీని మరింత బలోపేతం చేయడానికి రెండు రోజులు నిర్వహించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిరాశ మిగిల్చింది. విజయసాయిరెడ్డి రాకతో ఆపార్టీ నేతల మధ్య మరింత కాక రేపింది. అగ్నికి ఆజ్యం పోసినట్లు అయింది. నెల్లూరు నగరం, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో ఆపార్టీ విభేధాలు తారా స్థాయికి చేరాయి. నేతలు, కార్యకర్తలు అసంతృప్తిగా ఉండగా, సమన్వయ కమిటీ సమావేశాలు బహిర్గతం చేశాయి. పంచాయతీ ముఖ్యమంత్రి వద్దకు చేరేలా కనిపిస్తున్నాయి.

- ○విజయ్‌సాయిరెడ్డిరాకతో కాక
- ○నాలుగు చోట్ల రగులుతోన్న నేతలు
- ○సిఎం వద్దకు నెల్లూరు పంచాయతీ

మీడియాతో మాట్లాడుతోన్న విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

అధికార వైసిపిలో 2024 ఎన్నికలు గుబులు పుట్టిస్తున్నాయి. రాష్ట్రంలో బలమైన జిల్లాలో నెల్లూరు ఒకటి. గత ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయ డంఖా మోగించింది. ప్రజలు వైసిపిపై విశ్వాసం చూపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తమ ప్రభుత్వం అధికారంలో వస్తే బాగుంటుందని భావించారు. సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి,మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో స్థానిక నేతలు పెద్ద ఎత్తున నగదు ఖర్చుపెట్టుకున్నారు. ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదు. సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. దీంతో జిల్లా వ్యాపితంగా నాయకులు, కార్యకర్తలు, ఎంఎల్ఎలు, సెకండరీ క్యాడర్‌నేతల మధ్య విబేధాలు పెరిగాయి. గతంలో ఎంఎల్ఎలతో కలిసి,మెలిసి నడిచిన నేతలంతా ఇప్పుడు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. నెల్లూరు నగరం, ఉదయగిరి, కావలి, కందుకూరు నియోజకవర్గాల్లో తీవ్ర స్థాయిలో విబేధాలు కొనసాగుతున్నాయి. నెల్లూరు నగరంలో ఎంఎల్ఎ అనిల్‌కుమార్‌యాదవ్, రూప్‌కుమార్ యాదవ్ నాలుగేళ్ల కలిసి పనిచేశారు. ఇప్పుడు రెండు గ్రూపులుగా విడిపోయి నువ్వా, నేనా ఉన్నారు. అప్పుడప్పుడు బహిరంగానే విమర్శలు చేసుకుంటున్నారు. ఎవరి దారిలో వారు వెళుతూ పార్టీని ఇరుకున పెడుతున్నారు. కావలి నియోజకవర్గంలో ఎంఎల్ఎ రామ్‌రెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డిలు కలిసి వ్యాపార లావాదేవీలు కొనసాగించారు. ఏడాది నుంచి ఇద్దరి మధ్య యుద్ధమే సాగుతోంది. పార్టీ నేతలు రెండుగా చీలిపోయారు. అక్కడ పరిస్థితి దారుణంగా ఉంది. ఉదయగిరి నియోజకవర్గంలో మేకపాటి కుటుంబానికి వ్యతిరేకంగా ఏడుగురు నేతలు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఈ అంశం అనేక సార్లుపార్టీ పెద్దల దృష్టికి వెళ్లింది. రాజీ చేయాలని చూసిన సర్దుబాటు కాలేదు. కందుకూరు నియోజకవర్గంలో ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి, ఎంఎల్‌సి మాధవరావు గ్రూపు మధ్య నువ్వా నేనా అన్నట్లు ఉంది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో నాలుగు నియోజకవర్గాల్లో వైసిపి పరిస్థితి దయనీయంగా ఉంది. వీటిని సర్దుబాటుచేసి, నేతల మధ్య సమన్వయం చేయడానికి వైసిపి అధిష్టానం ప్రయత్నాలు చేయాల్సి ఉంది. ఇప్పుడు ఒక అడుగు ముందుకేస్తే అది మరింత ఇబ్బందిగా మారింది.

విజయసాయిరెడ్డి రాకతో కాక..!

వైసిపిలోని విబేధాలు సర్దుబాటు చేయడానికి ఆపార్టీ నేత విజయసాయిరెడ్డి 11,12,13 మూడు రోజులు జిల్లాలో పర్యటించిన విషయం తెలిసిందే. రెండు రోజులు నియోజకవర్గ నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశాల్లో నెల్లూరు నగరం, ఉదయగిరి, కావలి, కందుకూరు నియోజకవర్గాల్లో ఉన్న విబేధాలు ఆగ్నికి ఆజ్యం పోసినట్లు తయారైంది. ఉదయగిరి, కావలి, కందుకూరు నియోజకవర్గాల్లోని నేతలు సమావేశాల్లోనే నిరసన గళం విప్పారు. ఇరు గ్రూపులు విమర్శలు చేసుకున్నారు. నువ్వేంతంటే. నువ్వేంతంటూ గొడవలకు దిగారు. కావలి నియోజక వర్గంలో మరింత తీవ్రమైన గొడవలు సాగాయి. సిఎం వద్దే తేల్చుకుంటామంటూ ఎంఎల్ఎ వెళ్లిపోయి మళ్లీ వచ్చారు. గ్రామాలకు వెళ్లిన తరువాత ఆపార్టీ నేతలు, కార్యకర్తల్లో విబేధాలు పెరుగుతున్నాయి. సమావేశాల్లో ఒకరిపై ఒకరు మాట్లాడుకున్నవారు స్థానికంగా మరింత విబేధాలు పెట్టు కుంటున్నారు. నెల్లూరు నగరంలో మౌనంగానే ఎవరి పనులువారు చేసుకుంటున్నారు. ఎవరు చెప్పినా విబేధాలు తగ్గేదే లేదు అంటున్నారు. విజయసాయిరెడ్డి రాక ఆపార్టీలో సమన్వయం చేయకపోగా, విబేధాలు మరింత పెంచాయి. ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని సర్దుబాటు చేస్తారా లేదా చూడాలి. నాలుగు నియోజ కవర్గాల్లో వైసిపి తీవ్రమైన పరిస్థితులు ఎదుర్కొంటుందని ఆపార్టీనేతలే చెబుతున్నారు..

మత్స్య రంగానికి ప్రోత్సాహం

రూ. 20 వేల కోట్లతో

కేంద్ర మత్స్య శాఖా మంత్రి పురుషోత్తమ్ రూపాల

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రు.20 వేల కోట్లతో మత్స్య రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక , పాడి పరిశ్రమల శాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాల పేర్కొన్నారు. శనివారం నగరంలోని విఆర్‌సి మైదానంలో సింహపురి సేంద్రీయ మేళా (ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, మత్స్య ఉప ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం) రెండో రోజు కార్యక్రమంలో ఆయన రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు పాల్గొన్నారు. తొలుత ఈ మేళాలో ఏర్పాటు చేసిన సేంద్రదీయ, మత్స్య ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, చిరుధాన్యాల స్టాళ్లను మంత్రులు సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించడమే కాకుండా అత్యధికంగా నిధులు కేటాయి స్తుందన్నారు. అందులో భాగంగా రూ. 2500కోట్లతో ప్రాజెక్టుల స్థాపనకు అనుమతులు మంజూరు చేశామన్నారు. వీటితోపాటు మరో రెండు ప్రాజెక్టులు రాష్ట్రంలో స్థాపించేందుకు అనుమతులు ఇవ్వాలని ప్రజాప్రతినిధులు కోరు తున్నట్లు తెలిపారు. కష్ణపట్నం వద్ద ఫిషింగ్ జెట్టిని త్వరలోనే నిర్మించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు మీదుగా జలమార్గంలో ప్రయాణిస్తూ రాష్ట్రంలోని కష్ణపట్నం పోర్టుకు ప్రవేశించినట్లు చెప్పారు. మత్స్యకార రంగానికి గత ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వలేదని, నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేంద్రంలో కొత్తగా మత్స్య మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారన్నారు. అటువంటి శాఖకు తనను మంత్రిగా నియమించిన అనంతరం పూర్తి స్వతంత్రంగా వ్యవహరిస్తూ మత్స్యకారుల అభివద్ధికి కషి చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో 8 వేల కిలోమీటర్ల పరిధిలో తీరప్రాంతం ఉందన్నారు. ఆ ప్రాంతాన్ని నమ్ముకుని సుమారు రూ. 3 కోట్ల మత్స్యకార కుటుం బాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఎపిలో 30 శాతం మత్స్య సంపద ఉత్పత్తి అవుతుందని, ఇది దేశంలోనే అత్యధికమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఎపి ముందంజలో ఉందన్నారు. గుజరాత్ కు చెందిన అమూల్ మిల్క్ కోపరేటివ్ సొసైటీ తన ఉత్పత్తులను విస్తతంగా మార్కెటింగ్ చేసి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, అదే తరహాలో మత్స్య ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేలా రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు చొరవ తీసుకోవాలని కోరారు. అన్ని నగరాల్లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ను ఏర్పాటు చేయాలని మత్స్యకార సంక్షేమ సమితి నిర్వాహకులను కోరారు.

కేంద్ర మంత్రి పురుషోత్తమ్ రూపాల, రాష్ట్ర మంత్రి అప్పలరాజును సత్కరిస్తున్న దృశ్యం

త్వరలోనే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభం

జిల్లాలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను ప్రపంచ మత్స్యకార దినోత్సవం రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేత ప్రారంభిస్తారని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. విఆర్‌సి మైదానంలో సింహపురి సేంద్రీయ మేళా కార్యక్రమంలో ఆయన కేంద్ర మంత్రితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ 95 శాతం పూర్తయిం దన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కషి చేస్తుందన్నారు. మత్స్యకారులం దరికీ మత్స్యకార భరోసా కింద రూ 10,000 ఆర్థిక సాయం, ఒక లీటర్ డీజిల్ కు రూ.9 సబ్సిడీ, ఎవరైనా మత్స్యకారులు మరణిస్తే 10 లక్షలు ఎక్స్గ్రేషియా అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక జిల్లాకు ఒక హార్బర్ నిర్మించేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పలు సమస్యలపై మత్స్యకార సంఘ నాయకులు కేంద్రమంత్రికి అర్జీలు అందజేశారు.ఎంపీలు బీద మస్తాన్ రావు, జివిఎల్ నరసిం హారావు,మత్స్య శాఖ కమిషనర్ కన్నబాబు, ఆప్కాప్ చైర్మన్ అనిల్ బాబు, ఇన్చార్జి కలెక్టర్ రోణంకి కూర్మనాధ్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు,మత్స్యకార సంక్షేమ సమితి నిర్వాహకులు పోలయ్య ఉన్నారు.

మహీధర్‌రెడ్డిని ఇంటికి పంపిస్తాం..

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి 'ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లా నుంచి వేరు చేసిన విషయంలో ప్రజలకు తీరని అన్యాయం చేసిన ద్రోహి ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి అని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయన్ను కందుకూరు ప్రజలు క్షమించరని, రాబోయే ఎన్నికల్లో ఆయన్ను ప్రజల సహకారంతో ఇంటికి పంపిస్తామని స్పష్టం చేశారు. కందుకూరులోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడిన నాగేశ్వరరావు ఎంఎల్ఎ వ్యవహార శైలిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 30 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే మహీధర్ రెడ్డి, 50 ఏళ్ల చరిత్రలో ఎవరూ చేయలేనంతగా, కందుకూరు ప్రజలకు తీరని ద్రోహం చేశారన్నారు. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపడంలో ఆయన తెర వెనుక కథ నడిపారని ఆరోపించారు. గతంలో కందుకూరు మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేసిన బిసి వర్గానికి చెందిన బూర్సు మాలకొండయ్యను ఎన్ని ముప్పు తిప్పలు పెట్టారో, అప్పట్లో అందరూ గమనించారని చెప్పారు. రాజకీయంగా తమను ప్రశ్నించే ముందు, ఎంఎల్ఎ ఏ పార్టీ నుంచి ఏ పార్టీలోకి, ఎలా వచ్చారో గుర్తు చేసుకుంటే మంచిదని నాగేశ్వరరావు హితవు పలికారు. 1994లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోతే, రెబెల్ గా నిలిచి, పార్టీ అభ్యర్థిపై కక్షగట్టి ఓడించిన ఘనత ఆయనదని ఎద్దేవా చేశారు. మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు, కందుకూరు గురించి ఏనాడూ పట్టిం చుకోకుండా, కేవలం సొంత ఆదాయం పైనే దృష్టిపెట్టారని విమర్శించారు. మన్నేరు, పాలేరు నుంచి వందల ట్రిప్పుల ఇసుక తరలించి అమ్ముకుం టున్నారన్నారు. ఇరిగేషన్ కాంట్రాక్టులన్నీ బినామీలైన నెల్లూరుకు చెందిన కంపెనీలకే కట్టబెడుతుండడం నిజం కాదా అని ఇంటూరి నాగేశ్వరరావు నిలదీశారు.పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెళ్ల వెంకట సుబ్బారావు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నాదెళ్ల వెంకటరమణయ్య, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి ఉన్నారు.

మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

టిడిపి పోస్టు కార్డు ఉద్యమం

తోటపల్లిగూడూరు : నారా చంద్రబాబు నాయుడు కోసం త్యాగాలకు సిద్ధమని టిడిపి మండల అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడారు. మాజీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మద్దిన గోపాల్ నాయుడు సూచనతో నిర్వహించిన పో స్ట్ కార్డ్ ఉద్యమంలో టిడిపి నేతలు చుక్కపల్లి మల్లికార్జున నాయుడు, చావా రమేష్, గుడ్లూరు గోపాల్ నాయుడు, మోహన్ రావు నాయుడు, చల్ల వెంకట శ్రీధర్, వేళ్ళ సోదరులు, మాలపాటి శ్రీనివాస్ నాయుడు, వల్లభనేని సతీష్, గుడ్లూరు శ్రీధర్, పచ్చ పశుపతి, నాశన గిరీష్, బుట్టి మల్లి కార్జున ఉన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : పేదవారి ఆకలి తీర్చే ఉద్దేశ్యంతో శీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా శనివారం పేదలకు దుస్తులు, ఆహారం అందజేశారు. పలువువురు తమ పెద్దల జ్ఞాపకార్థం కందుకూరు పట్టణ వీధుల్లో తిరుగుతూ ఉండే యాచకులకు, నిరాశ్రయులకు భోజనం ప్యాకెట్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకషి మానసిక వికలాంగుల ఆశ్రమంలో పిల్లలకు ఉదయం , మధ్యాహ్నం,రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, సభ్యులు ఉన్నారు.

ఆరోగ్యం ప్రజల హక్కుగా చట్టం చేయాలి

ప్రజారోగ్య వేదిక విజ్ఞప్తి

ప్రజాశక్తి-నెల్లూరు : సిఎం శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన సమీక్షలో 'ఆరోగ్యం అన్నది ప్రజల హక్కుగా ఉండాలి' అన్న మాటలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా 'ఆరోగ్య హక్కు' పేరుతో ప్రభుత్వం చట్టం తీసు కురావాలని, రానున్న ఎన్నికల్లో మ్యానిఫెస్టోలో చేర్చాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.వి.రమణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజస్థాన్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వం 'ఆరోగ్య హక్కు' పేరుతో చట్టాన్ని రూపొందించిందని గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్య సమస్యల పై ప్రజా ఆరోగ్య వేదిక చాలా ఏళ్లుగా క్షేత్ర స్థాయిలో చేస్తున్నామని, ప్రజా ఆరోగ్య వేదిక అనుభవాలను ప్రభుత్వం ఉపయో గించుకుని, ప్రజా ఆరోగ్యంపై చేసే చట్టం, దాని విధివిధానాల రూపకల్పన చేయా లని విజ్ఞప్తి చేశారు.

కృష్ణా జలాల పంపిణీ పై పునః సమీక్ష చేయాలి

రైతు సంఘం జిల్లా కమిటీ

ప్రజాశక్తి-నెల్లూరు : కృష్ణా జలాల పంపిణీపై కేంద్ర ప్రభుత్వం పునః సమీక్ష చేయాలని, ప్రధాని నరేంద్రమోడీ తక్షణమే స్పందించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం నగరంలోని రైతు సంఘ కార్యాల యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకుడు చంద్ర రాజ గోపాల్ మాట్లాడుతూ తెలంగాణా ఎన్నికలను దష్టిలో పెట్టుకొని, అక్కడ లబ్ది పొందేందుకు కేంద్రం ఇటువంటి నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర పభుత్వం వెంటనే స్పందించి కేంద్ర ప్రభుత్వపై ఒత్తిడి తీసుకొచ్చి జిఒను రద్దు చేయించాల న్నారు. రైతులకు అన్యా యం జరిగే విధంగా ఉన్న ఈ జిఒను కేంద్ర ఉపసంహారిం చుకోవాలని, లేని పక్షంలో అఖిల పక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తా మన్నారు. మిగులు జలాలతో సహ కృష్ణా నీటి పంపకం బ్రిజేష్ కుమార్ కమిటీ ఇప్పటికే చేసి ఉందన్నారు. ఇప్పుడు ఎపితో రాష్ట్రంతో సంప్రదించ కుండా కష్ణా జలాల పునః పంపిణీ కి కేంద్రం క్రొత్త ట్రిబ్యునల్ వేయడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రానికి తీరని నష్టం చేకూరు తుందన్నారు. ప్రతి సంవత్సరం కష్ణా జలాలను సోమశిల ప్రాజెక్టుకు విడుదల చేయడం ద్వారా జిల్లా రైతులకు లాభం చేకూరు తుందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పులిగండ్ల శ్రీరాములు, మూ లి వెంగయ్యలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

డాక్టర్ వేదమూర్తిరెడ్డికి అరుదైన గుర్తింపు

అపోలో వైద్యులు

ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ యూరాలజిస్ట్ డాక్టర్ పి. వేదమూర్తి రెడ్డి ప్రతిష్టాత్మక రికార్డులను సొంతం చేసుకున్నారు. శనివారం నగరంలోని అపోలో వైద్యశాలలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. అపోలో వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీ రాం సతీష్ మాట్లాడుతూ తమ వైద్యశాలలో యూరాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ పి.వేదమూర్తిరెడ్డి ఇటీవల ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ తో పాటూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లోనూ స్థానం పొందారన్నారు. తమ వైద్యశాలలో 2021లో 46 ఏళ్ల రోగి శరీరంలోని కుడి ప్రక్కన అడ్రినల్ గ్రంథిలో 13 సెంటీమీటర్ల మైలోలైపోమా అనే పెద్ద కణతిని ఎలాంటి కోత లేకుండా లాపరో స్కోపీ ద్వారా విజయవంతంగా డాక్టర్ వేదమూర్తి రెడ్డి తొలగిం చారన్నారు. 13 సెంటీ మీటర్ల కణితిని సౌత్ ఇండి యాలో ఇప్పటి వరకూ లాప రోస్కోపీ ద్వారా ఎవరూ తొలగిం చలేదన్నారు. ఈ విషయాన్ని డాక్టర్ వేదమూర్తి రెడ్డి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారికి తెలియజేయగా వారు పరిశీలించి ఈ విషయాన్ని ఈ ఏడాది ఆగస్టు 24న నిర్ధారణ చేశారన్నారు. గతవారం డాక్టర్ వేదమూర్తి రెడ్డికి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ధ్రువ పత్రంతోపాటు అవార్డును అందజేశారన్నారు. ఇదే సర్జరీ విషయంలో ఇండియా బుక్ రికార్డ్స్ ప్రతిని ధులు కూడా ధవపత్రం అందజేసి, అవార్డును అంద జేసినట్లు తెలిపారు. యూరాలజిస్టు డాక్టర్ వేదమూర్తి రెడ్డి మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన రికార్డులను తాను సొంతం చేసుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. అపోలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది వేదమూర్తి రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను చూపుతున్న వైద్యులు

కందుకూరు ఎంఎల్ఎ టికెట్ అడగలేదు..

ఎంఎల్‌సి తూమాటి మాధవరావు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గ వైసిపి టికెట్‌ను తాను ఎప్పుడు అడగలేదని శాసనమండలి సభ్యుడు తూమాటి మాధవరావు తెలిపారు. తారాస్థాయిలో వర్గ విభేదాలు అనే శీర్షికన ప్రజాశక్తిలో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందించిన మాధవరావు ప్రజాశక్తి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ విజయ్ సాయి రెడ్డి, నెల్లూరు జిల్లా వైసిపి అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను కందుకూరు నుంచి తాను శాసన సభకు పోటీ చేస్తాను టిక్కెట్ ఇవ్వమని అడగలేదన్నారు. అడిగినట్లు రుజువు చేస్తే ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేస్తానన్నారు. ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి తో తనకు ఎలాంటి విభేదాలు లేవన్నారు. ఆయనపై ఏనాడూ తాను అధిష్టానానికి ఫిర్యాదులు చేయలేదన్నారు. ఫిర్యాదులు చేసినట్లు తేలితే తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. నెల్లూరులో ఈ నెల 12వ తేదీ జరిగిన కందుకూరు నియోజకవర్గ వైసిపి సమీక్షలో మహీధర్ రెడ్డి గురించి మాట్లాడిన వ్యక్తులు ఎవరిని తాను సమావేశానికి పిలవలేదన్నారు. ఐప్యాడ్ టీం పిలిస్తేనే నాలుగు కార్లలో వాళ్లు వచ్చి అక్కడ మాట్లాడారే తప్ప తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తనకంటూ ముఠాలు, గ్రూపులంటూ ఏమీ లేవన్నారు. తాను వైసిపి విధానాలకు కట్టుబడి ఉంటానన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెంటే నడుస్తానన్నారు. పార్టీ కందుకూరు టికెట్ ఎవరికీ ఇచ్చినా వారి గెలుపు కోసం తాను పని చేస్తానని చెప్పారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మహీధర్ రెడ్డి తనను పనిచేయాలని అడగలే దన్నారు. తాను వైసిపి తరపున పోటీ చేసిన వారికి ఓటు వేసినట్లు తెలిపారు.

తూమాటి మాధవరావు

విద్యుత్ ఛార్జీలు తగ్గించే వరకూ పోరాటం : సిపిఐ

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ : వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఉచిత కరెంటు ఇస్తామని నమ్మబలికి ఇవాళ స్మార్ట్ కరెంటు మీటర్ల పేరుతో సర్వీస్, సర్ ఛార్జీలు విధిస్తూ ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్నారని సిపిఐ సీనియర్ నాయకులు రామరాజు పేర్కొన్నారు. పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించే వరకు భారత కమ్యూనిస్టు పార్టీ, సమితి ఆధ్వర్యంలో పప్పుల వీధి నుండి టౌనాస్ పేట వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. సిపిఐ నగర నాయకులు నాగేంద్ర, ముక్తి యార్, లీలా మోహన్, ప్రత్యూష్, సతీష్, సుబ్ర హ్మణ్యం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జిలానీ ఖాన్, రమణారెడ్డి పాల్గొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు మోయలేని విధంగా విద్యుత్ ఛార్జీల భారాలను మోపారని సిపిఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్ విమర్శించారు. శనివారం నగరంలోని జన్నత్ హుస్సేన్ నగర్ పెట్రోల్ బంక్ ప్రాంతంలో కరపత్రాలు పంపిణీ చేశారు.



నెల్లూరు సిటీలో..

కందుకూరు : ప్రజలపై అధిక భారమైన, పెరిగిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక పోస్ట్ ఆఫీస్ సెంటర్లో పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఐటియూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కె మురళి వై ఆనందం మోహన్ ఏఐవైఎఫ్ నాయకులు బొజ్జ చంద్రమోహన్ వెంకట్రావు ఏఐటీయూసీ నాయకులు దత్త రామా రావు నరస య్య సిపిఐ నాయకులు లక్ష్మీనారాయణ, యనమల కొండయ్య, ఉప్పుటూరు మాధవరావు ఉన్నారు.

విరాళం అందజేత

కందుకూరు : అంకమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణానికి కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, ఆయన సతీమణి సౌజన్య రూ. 5,00,116 చెక్కు ను అందజేశారు. శనివారం ఆ చెక్కును కమిటీ సభ్యులు దివి లింగయ్య నా యుడు, మాదాల మాల్యాద్రి లకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అందజేశారు.

భోజన ప్యాకెట్లు పంపిణీ

కందుకూరు : కందుకూరు డివిజన్ జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ స్కందపురి సోమేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద ఉన్న యాచకులకు శనివారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సేవాసమితి కార్యదర్శి శీలం వెంకటేష్ మాట్లాడుతూ జంగాల వెంకట రత్నమ్మ జ్ఞాపకార్థం కుమారుడు జంగాల రవి కోటి యాచకులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడు చనమాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంతో వైసిపి చెలగాటం

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్ : నారా చంద్రబాబు నాయుడు ఆరోగ్యంతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా చంద్రబాబు నాయుడు ఆరోగ్యం పై నేడు ప్రతి ఒక్కరూ చర్చించుకుంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం లైట్ తీసుకుంటుందని అన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు డిఐజి రవికిరణ్ రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చంద్రబాబు ఆరోగ్య విషయం లో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారని, చంద్రబాబు ఆరోగ్య విషయంపై డాక్టర్ల చేత విలేకరుల సమావేశం ఏర్పాటు చేయించకుండా ప్రెస్ మీట్ పెట్టడం పలు అనుమానాలకు దారితీస్తుందన్నారు. ప్రస్తుత డిఐజి రవి కిరణ్ రెడ్డి గతంలో నెల్లూరులో పనిచేశారని అప్పట్లోనే ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారన్నారు. ఆయన అవినీతిపరుడని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన ఆర్థిక మంత్రి సమీప బంధువు అని, అందువల్లనే ఆయన వైసిపి కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. టిడిపి నగర అధ్యక్షులు మామిడాల మధు, 10వ డివిజన్ ఇన్‌ఛార్జ్ తిరుమల నాయుడు, ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్, ప్రశాంత్ అంబ్రెల్లా వెంకటేశ్వర్లు నాయుడు, నారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలి

రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రెండు మూడు రోజుల నుండి అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని వారికి మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర టిడిపి వైద్య విభాగ రాష్ట్ర అధ్యక్షులు జట్టు శివప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

కందుకూరు : ప్రజాక్షేత్రం నుంచి చంద్రబాబు ను దూరం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఆధారాలు లేని కేసులు పెట్టీ, జైలు లో కనీస వసతులు కల్పించకుండా ఆయన ఆరోగ్యం పై దెబ్బ కొట్టేలా సైకో జగన్ రెడ్డి కుట్ర పన్నారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ అన్నారు. తక్షణమే చంద్రబాబు మెరుగైన వైద్యం దిశగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు తరలించాలనీ, ప్రభుత్వం అవలంబిస్తున్న కక్షపూరిత విధానాలను తీవ్రంగా ప్రసాద్ ఖండించారు.

క్రీడాపోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి శ్రీనివాసులు తెలియజేశారు. బుధవారం సంతనూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 17, అండర్ 14 బాల బాలికల జిల్లా కబడ్డీ జట్లకి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థుల వివరాలను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీ ఓగుబోయిన శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసులు సీనియర్ ఉపాధ్యాయులు రామిశెట్టి శ్రీనివాసరావు స్టాఫ్ సెక్రటరీ కె కృష్ణ ఉపాధ్యాయులు అభినందించారు.

ఐఎఫ్‌సి ఫౌండేషన్ సేవలు

ప్రజాశక్తి-కందుకూరు : 'ఆకలికి అందరూ బంధువులే" అనే నినాదంతో ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ కందుకూరు వారి ఆధ్వర్యంలో శనివారం దాతల సహా యంతో పేదవారికోసం కందు కూరులో నిస్సహా యులైన వారిని గుర్తించి వారికి భోజనాల ప్యాకెట్లు అందజే స్తున్నారు. ప్రతి ఒక్కరు తమ సామాజిక బాధ్యతగా పేదలకు చేయూత నివ్వాలని అని ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ తెలిపారు. ప్రెసిడెంట్ సాజిద్,ట్రెజ రర్ హఫీజ్, ఇన్‌చార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్ షంషుద్దీన్ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లను జిల్లా ప్రోగ్రాం అధికారులు, జిల్లా స్థాయి సలహా కమిటీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం కలెక్టర్ ఎం.హరినారాయణన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం. పెంచలయ్యల ఆదేశాల మేరకు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. నగరంలోని రాఘవేంద్ర స్కానింగ్ సెంటర్, శ్రీ సాయి పథం హాస్పిటల్స్, వెంకటరమణ హాస్పిటల్, సరస్వతి స్కానింగ్ సెంటర్లను అధికారులు తనిఖీ చేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు, డెమో బి.శ్రీనివాసరావు, డిప్యూటి డెమో కె.కనకరత్నం, జిల్లా స్థాయి సలహా కమిటీ సభ్యులు ఐ శ్రీనివాసరావు, కె.కుసుమకుమారి, జి.కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30వేల మెజారిటీతో హ్యాట్రిక్ సాధిస్తా..

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామిరెడ్డి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు మళ్లీ జగనన్న పరిపాలన కావాలని కోరుకుంటున్నారని, 2024 ఎన్నికల్లో కావలి నియోజకవర్గం నుండి తాను 3వ దఫా ఎంఎల్ఎగా 30వేల ఓట్ల మెజారిటీతో గెలిచి, హ్యాట్రిక్ సాధిస్తానని ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఎంఎల్ఎ నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శుక్రవారం వైసిపి కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి కావలి నియోజకవర్గ సమీక్ష సమావేశంలో తనను జగనన్న అనుమతితో కావలి నియోజకవర్గం నుండి 3వ సారి కూడా అభ్యర్థిగా పోటీ చేయాలని ప్రకటించారని తెలిపారు. తన హయాంలో కావలి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని, వాటిని చూసి, ఓట్లు తనకు వేసి, గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తనకు అభ్యర్థిత్వం ప్రకటించిన వైసిపి అధిష్టానానికి, అధినేత జగన్‌మోహన్ రెడ్డికి, కో-ఆర్డినేటర్ విజయసాయి రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో వైసిపి ముఖ్య నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి వెంకట నారాయణ, ఎంపిపి ఆలూరి కొండయ్య, జంపాని రాఘవులు, పొనుగోటి అనురాధ, మద్దిబోయిన వీరయ్య, గంధం ప్రసన్నాంజనేయులు, పందిటి కామరాజు, ఎపిసి చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

పాదయాత్ర కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతసాగరం

మాదిగల విశ్వరూప పాదయాత్రకు సంఘీభావంగా శనివారం మండలంలోని ఎస్‌సి కాలనీలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు విశ్వరూప పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా కోకన్వీనర్ తాటిపర్తి లక్ష్మయ్య మాదిగలు మాట్లాడుతూ వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ అక్టోబర్ 7న అలంపూర్ నుండి నవంబర్ 7 హైదరాబాద్ వరకు మాదిగల విశ్వరూప మహా పాదయాత్రలో నవంబర్‌లో జరిగే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ప్రతి మాదిగ పల్లెకు కరపత్రం చేరే విధంగా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నాయకులు మండలంలోని పాదయాత్రకు సంఘీభావంగా గ్రామగ్రామాన ప్రచారంలో దూసుకు పోవాలని ఎంఆర్‌పిఎస్ నేతలు తెలిపారు. విశ్వరూప పాదయాత్ర విజయవంతం కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి నాయకులు, వడ్డపల్లి రవి మాదిగ, సిహెచ్ బాబు మాదిగ, కాకి అరుణ్ మాదిగ, మాదిగ విద్యార్థులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

పూజారులకు నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణం బైపాస్ రోడ్డులోని వెలసియున్న శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మహాలయ అమావాస్య సందర్భంగా పేద బ్రాహ్మణ పూజారులకు ఆలయ ధర్మకర్త శ్రీ ఏటూరు సుధాకర్ రెడ్డి ఆయన సతీమణి శీర్ల కుమారి దంపతులు రూ.50వేల విలువచేసే నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటాపురంలో వెలసి ఉన్న రాధాకృష్ణ దేవాలయం ప్రధాన అర్చకులు రామయ్యస్వామి మాట్లాడుతూ ప్రతిఏడాది మహాలయ అమావాస్య సందర్భంగా ఏటూరు సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు పేద బ్రాహ్మణ పూజారులను సత్కరించి వస్తున్నారు. వారి కుటుంబ సభ్యులకు ఆ దేవుడు దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని వారు కోరారు. సుమారు 25 కుటుంబాల వారికి నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు ఏటూరు అశోక్ రెడ్డి, ప్రధాన అర్చకులు వి.కృష్ణమూర్తిశర్మ, పట్టణంలోని పలువురు పూజారులు పాల్గొన్నారు.

మురళీకృష్ణ నాయుడు ఎంపిక

ప్రజాశక్తి-కావలి

బిజెపి యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కిసాన్ మోర్చా కార్యదర్శిగా ఉన్న కంచర్ల మురళీకృష్ణ నాయుడును రాష్ట్ర బిజెపి కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ తన నియామకంపై హర్షం వ్యక్తం చేశారు.

చిన్నారులకు అభినందనలు

ప్రజాశక్తి-కావలి

నెల్లూరు నగరంలోని టౌన్ హాల్‌లో "నెల్లూరు జిల్లా డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్" నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో కావలి పట్టణం సంయుక్త నృత్య కళా నిలయం నాట్య గురువు లిఖిత, వారి శిష్య బృందం మనస్వి, దుర్గ నాగేశ్వరి, దుర్గా పావని, షమియ, గాయత్రి, హారిణి, మోక్ష, సాయి, జెస్సిలు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను, వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చేసిన నృత్యంపై పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లాలోని అనేక మంది కళాకారులు పాల్గొని నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ వ్యాపారవేత్త అమరావతి క్రిష్ణారెడ్డి, శిఖామణి యూత్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్.మోపూరు.భాస్కర్ నాయుడు, నెల్లూరు జిల్లా డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కావలి డ్యాన్స్ మాస్టర్స్, కళాకారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరావతి క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను, వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై సంయుక్త నృత్య కళా నిలయం నాట్య గురువు లిఖిత, వారి శిష్య బృందం చేసిన నృత్యం చాలా అద్భుతంగా ఉందని తెలిపారు. చూపరులను ఎంతగానో ఆకట్టుకుందని ప్రశంసించారు. నేటి సమాజంలో ప్రజల్లో చైతన్యం కోసం ఇటువంటి నృత్యాలు చేయడం ఎంతో అవసరమని తెలిపారు. వెన్నెల్లో కొంతమందిలో నైనా మార్పు వస్తే అవకాశం ఉంటుందని తెలిపారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన లిఖిత గ్రూప్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సంయుక్త సేవాసంస్థ ద్వారా నిర్వహిస్తున్న సేవల గురించి అందరికి తెలియజేసి, సంస్థ సేవలను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రహరీ నిర్మాణంపై అధికారుల విచారణ

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని గ్రద్దగుంట గ్రామ పంచాయతీలోని ప్రహరీ నిర్మాణంపై నెలకొన్న వివాదంపై మండల అధికారుల కమిటీ సభ్యులు శనివారం సందర్శించి విచారణ చేపట్టారు. వివాదంగా మారిన ప్రహరీ నిర్మాణం పై జగనన్న కెబుదాం కార్యక్రమంలో ప్రహరీ నిర్మించిన గృహ యజమాని వివవలూరు శ్రీనివాసులు ఫిర్యాదు నేపథ్యంలో ఈ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గృహ యజమాని వి.శ్రీనివాసులును, స్థానిక సర్పంచ్ మల్లికార్జున, స్కూల్ హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి వై.భవానీలను కమిటీ సభ్యులు విచారించారు. అనంతరం శ్రీనివాసులు వారి వద్ద ఉన్న స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు సమర్పించారు. తహశీల్దార్ పరిశీలించి స్కూల్‌కు సంబంధించిన ప్రజలు వేసిన స్థలం సంబంధ కమిటీ సభ్యులు ఫిర్యాదుదారుని నివేదికను సర్పంచ్ తమ్ముడు శ్రీరాజ్ ఫిర్యాదుదారునికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా పోలీసు వారు జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా వివవలూరు శ్రీనివాసులు మాట్లాడుతూ తన నివాసం పక్కన స్థలం ప్రహరీ గోడ నిర్మించాననీ అయితే స్థానిక సర్పంచ్ తమ్ముడు దుర్బుద్ధితో సర్వే నెంబర్‌లో ఉన్న 155/2 తన స్థలాన్ని కాజేయాలని పంచాయతీ ద్వారా పలు నోటీసులు ఇచ్చారని తనను మానసికంగా చాలా ఇబ్బంది పెట్టారని తెలిపారు. మండల కమిటీ సభ్యులు ఇరుపక్షాల వారిని సమన్వయంతో సామరస్యంగా సమస్యను పరిష్కరించు కోవాలని తెలిపారు. పంచాయతీ వారు దుర్మార్గంగా వ్యవహరించడం వారి హోదాకు తగదన్నారు. సర్పంచ్ గ్రామ పెద్దలతో మాట్లాడామనీ శ్రీనివాసులు అంగీకారంతో పట్టా స్థలానికి కొలతలు తీసి, హద్దులు గుర్తించి పనిని చేపట్టేందుకు అంగీకారం కుదరడంతో అధికారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి, ఎంఇఒ రవీంద్రనాథ్, ఇఒపిఆర్‌డి వెంచలవీరేంద్ర, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా అభివృద్ధి పనులు, విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయలు, పరిశ్రమలు, నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పన తదితర అంశాల్లో ఆత్మకూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందించి భాగస్వాములు కావాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. తిరుపతిలోని ఐఐటి కళాశాలలో రెండు రోజుల పాటు ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికపై దేశ విదేశాలకు చెంది పలురంగాల్లో నిష్ణాతులైన ఎన్‌జిఒలతో ఎంఎల్ఎ మేకపాటి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి పనులు చేసేందుకు నియోజకవర్గంలో ఉండి బయట దేశ, విదేశాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్న వారిందని ఒకే వేదికపైకి తెచ్చి ఎడిఎఫ్ ఏర్పాటు చేయడం జరిగిందని, దాని ద్వారా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. అయితే పలు గ్రామాలలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఎడిఎఫ్ ద్వారా అవసరమైన నగదును సమకూర్చినప్పటికీ ఆ అభివృద్ధి ముందుకు సాగేందుకు ప్రణాళిక, కార్యాచరణ అవసరమని, ఇప్పటికే మీరు ఇలాంటి అభివృద్ధి పనులు బయట ఎక్కడెక్కడో చేసి ఉన్నారు కాబట్టి ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిలో మీరందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రధానంగా ఎడిఎఫ్ ద్వారా నియోజకవర్గంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ డిజిటల్ క్లాస్ రూములు ఏర్పాటు చేసి సీడ్స్‌సంస్థ ద్వారా వారికి అవసరమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోనేందుకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వసతుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. మెట్టప్రాంత రైతాంగ ప్రయోజనాల కోసం తీసుకోవాల్సిన చర్యలపై త్వరలోనే రైతు సదస్సు నిర్వహించి అందులో అనుభవులైన వారితో రైతులకు ముఖాముఖి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు నియోజక వర్గానికి చెందిన అనేక మంది ముందుకు వస్తున్నారని, వాటిని కార్యరూపంలోకి తెచ్చేందుకు ఇప్పటికే అనుభవం కలిగిన మీ అందరి సహకారం అవసరమని తెలిపారు. రెండురోజుల పాటు నిర్వహించిన వర్క్ షాపులో సీడ్స్ సంస్థ వ్యవస్థాపకులు ఆర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఐఐటి, తిరుపతి కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణతో పాటు పలు ఎన్‌జిఒలకు చెందిన ప్రముఖులు పాల్గొని మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల నిర్వహణ గురించి సమిష్టిగా చర్చించి సలహాలు, సూచనలు అందజేశారు. త్వరలోనే ఆత్మకూరు నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి తాము స్వయంగా వచ్చి పరిశీలించి పనులను నిర్వహించేందుకు తమ పూర్తి సహకారం అందిస్తామని ఎంఎల్ఎ మేకపాటికి వివరించారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం క్రిష్టియన్‌పేట మూడవ లైన్‌లో నివసిస్తున్న భోగిరి సరోజనమ్మ 72వ జయంతి సందర్భంగా శనివారం మొదటగా ఆమెకు నివాళు లర్పించి, ఆమె భర్త బి.ప్రభాకరరావు, పిల్లలు, కుమారులు ఉన్నత ఉద్యోగాలు పొందిన తల్లి ఆశయ సాధన కోసం పట్టణంలోని పేద ప్రజలకు తమ వంతు సహాయంగా సుమారు 250 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆమె పిల్లలు బి.మోజస్‌పాల్, డిఎస్‌పి, బి.అరుణ్ కుమార్, ఇరిగేషన్ ఇంజనీర్, బి.ప్రభావతి, ప్రభుత్వ డాక్టర్ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో బి.జాన్, బి.విన్సెంట్, రామక్రిష్ణ, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, న్యాయవాది ఐ.సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'కాకర్ల' ఆర్థికసాయం

ప్రజాశక్తి-సీతారామపురం

మడలంలోని బసినేని పల్లి, మారంరెడ్డిపల్లి పంచాయతీల్లో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ ఆర్థికసాయం అందజేశారు. కాకర్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని బసినేనిపల్లి పంచాయతీలో ఇటీవల అనారోగ్యంతో ఈరి పెద్ద ఓటులేసు మరణించిన విషయం, అదేవిధంగా మారంరెడ్డిపల్లి గ్రామంలో కలివెల తిరుపతమ్మ భర్త బాలస్వామి డయాలిసిస్ సమస్యతో తిరుపతిలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాలను గ్రామ పెద్దలు టిడిపి నియోజవర్గ నాయకులు, కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ దృష్టికి తెలుపగా వెంటనే స్పందించి ట్రస్టు ప్రతినిధులు ద్వారా కుటుంబాన్ని పరామర్శించి స్థానిక టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కల్లూరి వెంకటేశ్వర రెడ్డి, ట్రస్ట్ కోఆర్డినేటర్ సుమన్, ట్రస్టు సభ్యులు తిరుపతయ్య, బుజ్జి, డాక్టర్ ఆంథోనీ, బాబు, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్థాంతరంగా ఆగిన ఫిషింగ్ హార్బర్ పనులు

ప్రజాశక్తి-కావలి/కావలి రూరల్

మాట్లాడుతున్న జనసేన నాయకులు

కావలి నియోజకవర్గం, బోగోలు మండలంలో ఉన్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పనులు అర్థాంతరంగా ఆగిపోయాయని కావలి నియోజక వర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఫిషింగ్ హార్బర్‌లో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఆర్భాటంగా రూ.280 కోట్లతో మొదలు పెట్టినప్పుడు మత్యకారుల వలసలు ఆగుతాయని, వారు సుదూర ప్రాంతాలకు వెళ్లే పని లేకుండా అందరూ ఇక్కడే మత్స్య సంపదపైనే ఉన్న ఊరిలోనే ఆ గంగమ్మ తల్లి వడిలోనే జీవనం సాగించవచ్చున్న ఆనందం మూడునాళ్ల ముచ్చటే అయిందని విమర్శించారు. సుమారుగా 90శాతం పనులు పూర్తి అయ్యాయని గత 3 నెలలుగా ఇక్కడ ఏ ఒక్క పని కూడా జరగకుండా ఆగిపోయి ఉన్నాయని తెలిపారు. కేవలం కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇవ్వనందువల్లే ఆపేసినట్లు ఈ ఎంఎల్ఎను ఈ ప్రభుత్వాన్ని ఇక్కడ ఉన్న గంగపుత్ర సోదరులు తిడుతున్నారని తెలిపారు. ఈ ఎంఎల్ఎ వారి వర్గం కేవలం మాటలకు, బెదిరిపులకు, ఇసుక, మట్టి దోపిడీకి, సొంత సంపాదనకు తప్ప ఏ ఒక్క పని చెయ్యక పోవడం విచారకరమన్నారు. కావలికి అందుబాటులో ఉండి కావలి కనకపట్నం అవడానికి దోహదపడే ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్ట్, దగదర్తి ఎయిర్‌పోర్ట్‌లో ఏ ఒక్కటీ ఈ ప్రభుత్వం కంప్లీట్ చెయ్యలేక పోయినందుకు, ముఖ్యంగా 10 సంవత్సరాలు కావలి ఎంఎల్ఎగా ఉన్నందుకు ఆయనపై ఘాటుగా స్పందించారు. ఈ ఫిషింగ్ హార్బర్ పనులు వెంటనే మొదలు పెట్టి త్వరగా పూర్తి చేసి మత్స్యకారులకు మేలు చెయ్యాలని లేని పక్షంలో రాబోయే ప్రభుతం మాదే అని అప్పుడు తప్పక అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన మత్స్యకార రాష్ట్ర కార్యదర్శి శ్రీను, నాయకులు ప్రసాదు, ప్రకాష్, జోని, రాజా, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో స్కూల్స్ నిర్వహిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-కావలి రూరల్

దసరా సెలవుల నేపథ్యంలో 14వ తేదీ నుండి 24వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించింది కాబట్టి కావలి మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యం సైతం నడుచుకోవాల్సిందిగా ఎంఇఒలు ఎం గోవిందయ్య, సిహెచ్ వెంకటసుబ్బయ్య ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నియమనిబంధనలను పాటించకుండా సిలబస్ పూర్తి కాలేదనే, నెపంతో స్టాఫ్ మీటింగ్, వర్క్‌షాప్, రిజిస్టర్ వర్క్, పేరుతో అదనపు తరగతులు నిర్వహిస్తే ఆ ప్రయివేట్ విద్యాసంస్థల పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

కరెంట్ ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి-కావలి రూరల్

మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

రాష్ట్రంలో ప్రజలు విద్యుత్ బిల్లులు ముట్టుకుంటే షాక్ కొట్టే పరిస్థితి వచ్చిందని, పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలని వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం కావలి బ్రిడ్జి సెంటర్ నుండి కరపత్రాలు పంపిణీ చేశారు. జగన్మోహన్ రెడ్డి చేతగానితనం, స్వార్థ ప్రయోజనాలతో విద్యుత్ రంగం కుదేలు అయిందన్నారు. తమది పేదల ప్రభుత్వం, పెత్తందారులపై తమ పోరాటం అని చెబుతూ ప్రజలపై భారాలు వేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రం ఆదేశాల మేరకు విద్యుత్ సంస్కరణల పేరుతో రాష్ట్రం ప్రభుత్వం "ఫిక్సిడ్ ట్రూ అప్ కస్టమర్ ఛార్జీల పేరు"తో విద్యుత్ వినియోగదారులపై అధిక భారం మోపుతుందన్నారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో ఇప్పుడు వసూళ్లు చేయడం సమంజసం కాదన్నారు. విద్యుత్ ఛార్జీలు వెంటనే రద్దు చేయాలని, కరెంట్ ఛార్జీలు తగ్గించాల్సింది పోయి అదనపు ఛార్జీలు వసూళ్లు చేయడం దారుణమన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కరెంట్ ఛార్జీలు పేరుతో ప్రజలపై భారం మోపిందని, సర్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలను వేంటనే వెనక్కి తీసుకోవాలని లేదంటే రానున్న రోజుల్లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పసుపులేటి పెంచలయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె.నాగరాజు, రైతు సంఘం నాయకులు బలిజేపల్లి వేంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా దమ్ము దర్గాబాబు, సిపిఐ న్యూడెమోక్రసి కార్యదర్శి కరవది భాస్కర్, సిపిఐ మంఎల్ లక్కిరెడ్డి, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఎల్.శ్యామల నరసింహారావు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'వాక్ ఫర్ ఫ్రీడమ్'

ప్రజాశక్తి-కావలి

'మూవ్‌మెంట్ ఇండియా" వారి సహకారంతో "గ్రామజ్యోతి సొసైటీ" వారి సౌజన్యంతో స్థానిక ప్రియదర్శిని మహిళ మండలి వారి ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో "మానవ అక్రమ రవాణా నిర్మూలన"పై "స్వేచ్ఛ కోసం నడక" కార్యక్రమాన్ని నిర్వహించారు. మూవ్‌మెంట్ ఇండియా వారి సౌజన్యంతో గ్రామ జ్యోతి సొసైటీ వారి సూచనల మేరకు "వాక్ ఫర్ ఫ్రీడమ్" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ "ఇది స్వాతంత్ర్యం కోసం తాము నడిచే నడక, న్యాయం, మానవ గౌరవం కోసం నడిచే నడక, అన్నారు. శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల నుండి బుడంగుంట రైల్వే గేటు వరకు "వాక్ ఫర్ ఫ్రీడమ్ "ర్యాలీని ముఖ్య అతిథులు డాక్టర్ కర్నాటి రోహిత్, గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి జెండా ఊపి ప్రారంభించారు. లాయర్ ఇస్కల సాయిప్రసాద్ యువత, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కర్నాటి రోహిత్ మహిళలు సమాజంలో అణగారి వర్గాల ప్రజలు అక్రమ రవాణాకు గురికాకుండా వెట్టి చాకిరికి, వృత్తుల పేరుతో, విద్య, ఇతర రవాణాల పేరుతో ఉండటాన్ని నిర్మూలించడం కోసం ఇలాంటి చైతన్య వంతమైన క్లిష్ట సందర్భాల కోసం హెల్ప్ లైన్ ఫోన్ నెంబర్స్ 1098, 181ని ప్రతిఒక్కరూ వారి చేతి ఫోన్లల్లో లింక్ చేసుకొని ఇతరులకు సహాయ పడడానికి సహకరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ డాక్టర్ బి.రవికుమార్, కళాశాల డైరెక్టర్ పి.జానకిరామ్, స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్ దర్బాషా, జమీర్, ఎం.పి.జె.రఫీ అహ్మద్, బ్రహ్మయ్య, దామా మధుసూదన్‌రావు, రమేష్, టి.సి.మాల్యాద్రి నాయుడు, వి.ఎం.ఎన్.ఆర్.మాలి, శారద, లోక్ సత్తా మాలకొండారెడ్డి, జెవివి సభ్యులు సి.శారద, జి.కల్యాణి, జి.హరనాద్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ సాయితేజ, కళాశాల విద్యార్థులున్నారు.

తాగునీటి కోసం పైప్‌లైన్ ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని పడకండ్ల పంచాయతీ మజరా బొటికర్లపాడు గ్రామ ఎస్‌సి కాలనీలో తాగునీటి కోసం పైపులైన్ పనులు ప్రారంభించామని సర్పంచ్ మాముడు నరసింహులు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో ఎస్‌సి కాలనీలో ఉప్పునీటి సమస్య ఉండడంతో స్థానిక ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో కావేరి వాగులో బోరు వేసి ఆ గ్రామానికి మంచినీటిని సరఫరా చేసేందుకు జల్ జీవన మిషన్ ద్వారా బొటికర్లపాడు ఎస్‌సి కాలనీకి మంచినీటి కొళాయిలను వేసేందుకు శనివారం పైప్‌లైన్లు వేసి ప్రారంభించినట్లు సర్పంచ్ తెలియజేశారు. స్థానిక ప్రజలు మంచినీటిని కాలనీకి సరఫరా చేసేందుకు స్థానిక ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి చొరవతో ఈ పనులు చేయడంతో గ్రామస్తులు ఎంఎల్ఎకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నాయబ్ రసూల్, తుమ్మల శ్రీనివాసులు రెడ్డి, దొడ్ల వెంకటేశ్వర్లు, ఉలవ కొండయ్య, గుర్రాల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె. మునీర్ జాన్

ప్రజాశక్తి-కావలి

నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్.మునీర్ జాన్‌ను జిల్లా కార్యవర్గ సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వైఎస్ఆర్‌టిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసు, రాష్ట్ర కార్యదర్శి శివశంకర్ రెడ్డి, రఘురామరెడ్డి నేతృత్వంలో ఈ ఎంపిక చేశారు. ఈ అవకాశం కల్పించిన కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి, ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలకు మునీర్‌జాన్ ధన్యవాదాలు తెలియజేశారు.

టిడిపి నేతల ఆమరణ నిరాహార దీక్ష

ప్రజాశక్తి-కొండాపురం

ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న టిడిపి నేతలు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆయనకు మద్దతుగా టిడిపి నాయకులు భీమవరపాడు మాజీ సర్పంచ్ టిడిపి నాయకుడు చాగంటి కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నుండి ఆమరణ నిరాహార దీక్షకు చేపడుతున్నారు. ఆయనకు మద్దతుగా మండలంలోని 19 పంచాయతీల టిడిపి నాయకులు కార్యకర్తలు రెండవ రోజున శనివారం ఉదయగిరి నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ కంభంపాటి విజయరామరెడ్డి ఆయన సతీమణి కలిగిరి మండలం మండల కన్వీనర్ కృష్ణారెడ్డి దీక్షలో పాల్గొన్నారు. రెండు రోజులుగా ఆమరణ నిరాహార దీక్షలో పాల్గొన్న జిల్లా కార్యవర్గ కమిటీ సభ్యులు చెరుకూరి నవీన్, సర్పంచ్ మణికుమార్, నారాయణ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని వారిని పరిశీలించేందుకు స్థానిక తహశీల్దారు శ్రీనివాసులు కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిని పంపించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఎస్ఐ ఎస్‌కె ఖాజావలీ స్థానిక ఆర్ఎంపి వైద్యులు వెంకట్రావును పిలిపించి వారికి వైద్యం నిర్వహించారు. వీరిలో ముగ్గురికి సుగర్ లెవెల్ తగ్గిందని తెలిపారు. ఈ సందర్భంగా కంభంపాటి విజయరామరెడ్డి మాట్లాడుతూ తమ నాయకుడు నారా చంద్రబాబునాయుడును కక్షపూరితంగా వైసిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిబి సిఐడితో అక్రమ అరెస్టు చేశారన్నారు. విడుదల చేసేంత వరకు దీక్ష కొనసాగుతుందని, ప్రాణంపోయినా దీక్ష విరమించేది లేదన్నారు. 74 ఏళ్ల వయసులో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన ఆయనను ఎటువంటి తప్పు చేయకపోయినా తప్పుడు కేసులు బనాయించి జైల్లో పెట్టడం దారుణమన్నారు. సిఐడి వద్ద గానీ వైసిపి నాయకుల వద్ద గానీ దమ్ము ధైర్యం ఉంటే ఆధారాలు చూపించాలని ఆయన బహిరంగ ఛాలెంజ్ చేశారు. ఇలాంటి బెదిరింపులకు తమ నాయకుడు బెదిరేవాడు కాదన్నారు. టిడిపిని బలహీనపరిచేందుకు ఆయన కుమారుడు నారా లోకేష్ పాదయాత్రకు భంగం కలిగించేందుకు పాదయాత్రలో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఆయనపై కూడా అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఈ విషయాలను ప్రజలంతా గమనిస్తున్నారని ఏ క్షణం ఎన్నికలు వచ్చినా జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపుతారని ఆయన హెచ్చరించారు. టిడిపి నాయకులు కార్యకర్తలు సమయాన్ని పాటించి ధైర్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు వెంకటాద్రి, ఉదయగిరి నియోజకవర్గం రైతు నాయకుడు రామారావు పాల్గొన్నారు.

ఎంఎల్‌సితో నూతన జిల్లా కార్యవర్గం

ఎంఎల్‌సిని కలిసిన వైఎస్ఆర్‌టిఎఫ్

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరులో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నూతనంగా ఎన్నికైన ఎపి వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి చంద్రశేఖర్ రెడ్డి వారిని అభినందించారు. జిల్లాలో వైఎస్ఆర్‌టిఎఫ్‌ను మరింత బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షులు నారాయణరాజు, ప్రధాన కార్యదర్శి మునీర్ జాన్‌లకు సూచించారు. కార్యక్రమంలో ట్రెజరర్ సిద్దా యానాదిరెడ్డి, వైఎస్ఆర్‌టి ఎఫ్ రాష్ట్ర నాయకులు వాసు, శివ శంకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా సాధనకు అపూర్వ స్పందన

ప్రజాశక్తి-ఉదయగిరి

జిల్లా సాధనకు సానుకూల సమయమిదేనని క్రిష్ణంపల్లి గ్రామంలో శంఖాన్ని పూరించడంతో ప్రజల నుండి అపూర్వ స్పందన వచ్చినట్లు ఉదయగిరి జిల్లా సాధన కమిటీ అధ్యక్షులు డాక్టర్ కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరపడుతున్నందున రాజకీయ నేతలను, అభ్యర్థులను ప్రజలు డిమాండ్ చేయాలని కోరారు. క్రిష్ణంపల్లి గ్రామంలో జిల్లా సాధనపై రచ్చబండ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉదయగిరి ప్రాంతం కొత్త జిల్లాగా ఏర్పాటు చేయడానికి తగిన అర్హతలున్నా యని వివరించారు. అలాగే జిల్లా సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి అహమ్మద్ మాట్లాడుతూ పార్టీలకు, కులాలకు మతాలకు అతీతంగా జిల్లా సాధనకు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. జిల్లా సాధన నేత షేక్ ఖాదర్‌బాషా ఉద్యమక్రమాన్ని వివరించారు. జిల్లా సాధనకు మద్దతు పలికి జై కొట్టారు. గ్రామ నేత సింగనబోయిన సుబ్బ రాయుడు మాట్లాడుతూ 13 జిల్లాలను 26 జిల్లాలుగా విస్తరించి మన జిల్లాకు మాత్రం అన్యాయం చేశారని ఆవేదన వెలిబుచ్చారు. గ్రామ నేతలు కొండ్రెడ్డి భాస్కర్ రెడ్డి, వీరారెడ్డి, సింగన బోయిన సుబ్బరాయుడు, పొద్దుటూరి హసాన్, కల్లూరి సుబ్బారెడ్డి, ఎన్.వి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో వేడెక్కుతున్న రాజకీయం

ప్రజాశక్తి-నెల్లూరు

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లాలో రోజురోజుకూ రాజకీయం వేడెక్కుతుంది. రెండు రోజులపాటు నగరంలో వైసిపి సమన్వయ కమిటీ సమావేశాలు ఆ పార్టీ నాయకత్వం నిర్వహించింది. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర నాయకులు, ఆయా నియోజకవర్గ శాసనసభ్యుల మాటలకు విని వెళ్లారే తప్ప తమతమ అభిప్రాయాలను ఏ మాత్రం బహిర్గతం చేయలేదు. కొన్ని నియోజకవర్గాలకు సంబంధించి మాట్లాడే సమయంలో శాసనసభ్యుల అనుచరులు తీవ్ర స్థాయిలో రాష్ట్ర నాయకుల మాటలకు అడ్డు చెప్పడం.. అలిగి సమావేశం నుంచి అర్థాంతరంగా వెళ్లిపోవడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సమావేశం పూర్తయిన తరువాత రాష్ట్రం నుంచి జిల్లాకు విచ్చేసిన రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక దాదాపుగా పూర్తి అయిందని, లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని అంటూ, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్ల ఎంపిక అంతా తమ పార్టీ అధ్యక్షుడి నిర్ణయమే తుది నిర్ణయం అవుతుందని చెప్పడం కొసమెరుపుగా నిలిచింది. జిల్లా సమగ్రాభివృద్ధిని ఆకాంక్షిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మూడు బృందాలు 11 రోజుల పాటు పాదయాత్రలు నిర్వహించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తాము నిర్వహించిన ఈ పాదయాత్రలు ఓట్ల కోసం కాదని, కేవలం ప్రజల సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకొనేందుకు మాత్రమే చేశామన్నారు. సాగునీరు, తాగునీరు, పరిశ్రమల స్థాపన, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఉపాధి అవకాశాల కల్పన, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వంటి పలు సమస్యల పరిష్కారం కోసమే పాదయాత్రలు చేశామన్నారు. నగరంలో మూడు రోజుల పాటు సింహపురి సేంద్రియ మేళా-2023 పేరుతో ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, మత్స్యఉప ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం, చిరుదాన్యాల విక్రయాల కార్యక్రమాన్ని ప్రకృతి వ్యవసాయ దారుల సంఘం, మత్స్యకార సంక్షేమ సమితి, రైతు సాధికార సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు విద్యుత్తు సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలను పెంచడాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఈ కార్యక్రమంలో భాగంగా వామపక్ష పార్టీల నాయకులు కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేస్తూ విద్యుత్తు ఛార్జీల పెంపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ పిలుపు నిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మహిళలు పూజా కార్యక్రమాలు, కార్యకర్తలు, నాయకులు కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేస్తు ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేస్తున్నారు. ప్రభుత్వం విలీనం పేరుతో కార్మికుల, ఉద్యోగుల హక్కులు తొలగింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమని ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులంటున్నారు. నగరంలోని ఆర్‌టిసి ఆర్ఎంఒ కార్యాలయం ఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ఉ ద్యోగులు కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆర్‌టిసి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసుకున్న నాటి నుంచి ఉద్యోగుల, కార్మికులపై డిపో మేనేజర్ల వేధింపులు అధికమైపోతున్నాయన్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులపై అధికారులు నిర్లక్ష్య ధోరణ అవలంభిస్తున్నారని, కార్మిక చట్టాలకు విరుద్ధంగా మహిళా సిబ్బందికి విధులు కేటాయిస్తున్నారంటూ ఆందోళన చేపట్టారు.

వీక్షణం